

### రూ.లక్షలోపు ఉన్నా మాఫీ కాలే..

యూనియన్ బ్యాంక్‌లో రుణం తీసుకున్నాను. రూ.లక్షలోపు రుణం ఉన్నా మాఫీ కాలేదు. అధికారులను అడిగితే మాకు తెల్వదని సమాధానం చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేశామని చెబుతూ సంబురాలు చేస్తున్నది. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. రుణమాఫీ కాక, రైతు భరోసా ఇవ్వక ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వం రుణమాఫీ ఏ ప్రాతిపదికన చేసిందో అర్థం కావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం వానాకాలానికి సంబంధించిన రైతుబంధు సకాలంలో ఇవ్వడంతో సంతోషంగా వ్యవసాయం చేసుకున్నాం. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టడానికి ఈ రుణమాఫీని తెరపైకి తెచ్చింది. అర్హత ఉన్నా రుణమాఫీ ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు. అధికారులను అడుగుదామంటే బ్యాంకులు రైతులతో కిటకిటలాడుతున్నాయి.

*- రవితేజారెడ్డి, రైతు, లత్తీపురం, జోగులాంబ గద్వాల జిల్లా*



మూసాపేట ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ వద్ద రుణమాఫీపై ఆరా తీస్తున్న రైతులు

## బ్యాంకుల వద్ద పడిగాపులు

మూసాపేట, జూలై 22 : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇటీవల మొదటి విడుతలో రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అమలులో మాత్రం అందరికీ కాకుండా కొందరికే వర్తించడంతో అయోమయం నెలకొన్నది. తమకు ఎందుకు రాలేదంటూ బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం పలు కారణాలు ఎత్తిచూపుతున్నారు. ప్రధానంగా సాంకేతిక సమస్య అని, పట్టాదారు పాస్‌బుక్‌లో ఉన్న పేరుకు ఆధార్‌కార్డులో ఉన్న పేరుకు, బ్యాంకు రుణఖాతాలో ఉన్న పేరులో చిన్నచిన్న తప్పులు ఉండడంతో అమలు కాలేదని చెబుతున్నారు. కానీ రైతులు ఎవరైనా ఉంటే తమకు ఫిర్యాదు చేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని సూచించారు. మరో రెండు విడుతల్లో మాఫీ అయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి రైతులకు నచ్చజెప్పి పంపుతున్నారు.

### కేసీఆర్ సర్కారే బాగుండే..



యూనియన్ బ్యాంక్‌లో రూ.40వేలు రుణం తీసుకున్నాను. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. రెగ్యులర్‌గా వడ్డీ చెలిస్తున్నా రుణమాఫీ కాలేదు. వడ్డీ చెల్లించని వారికి ప్రభుత్వం రుణమాఫీ చేసింది. గత కేసీఆర్ ప్రభుత్వమే మేలు. ఓ క్లారిటీగా రుణ మాఫీ చేసింది. రైతు భరోసా ఇవ్వలేక ప్రభుత్వం రుణమాఫీ చేసి రైతులను బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేస్తున్నారు. రుణ మాఫీపై ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలి.

*- వెంకటన్న, రైతు, లత్తీపురం, జోగులాంబ గద్వాల జిల్లా*



వివరాల కోసం వచ్చిన రైతులతో కిటకిటలాడుతున్న గద్వాల యూనియన్ బ్యాంకు

- మేము అర్హులం కాదా అని రైతుల నిలదీత
- అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నామని పలువురి ఆవేదన
- ఉమ్మడి జిల్లాలో కొర్రీలతో కోతలు
- బ్యాంకుల వద్ద క్యూ
- గద్వాల జిల్లాలో తొలి విడుతలో 24,398 మందికే మాఫీ

# మాకేదీ రుణమాఫీ?

గద్వాల, జూలై 22 : తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అంతా గందరగోళంగా మారింది. జాబితాలో పేరున్నా కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదు. రుణ మాఫీ అయిందా లేదా అని తెలుసుకుందామని రైతులు బ్యాంకులకు వెళితే బ్యాంకులన్నీ రైతులతో కిటకిట లాడుతున్నాయి. రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ అంటూ రైతు భరోసా గురించి ఆలోచించకుండా చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. రైతు భరోసా కింద వానకాలం సాగుకు పాతపద్ధతిలో ఇస్తే సుమారు రూ.232 కోట్లు జిల్లాకు అవసరమవుతాయని, కానీ రుణమాఫీ ద్వారా లక్షలోపు రుణాలు తీసుకున్న వారికి రూ.144కోట్లు రుణమాఫీ అవుతుండడంతో ప్రభుత్వం మొదట రుణమాఫీ చేసినట్లు తెలిసింది. రుణమాఫీ కంటే ముందు రైతు భరోసా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రుణమాఫీ చేసిన తర్వాత దానిని రెన్యువల్ చేసుకోవడానికి రైతులు వెళితే వడ్డీ కట్టండి ఆ తర్వాత రెన్యువల్ చేస్తామని బ్యాంకర్లు చెబుతుండడంతో రైతులకు ఏమి చేయాలో తోచడం లేదు. బ్యాంకు అధికారులు వడ్డీ కట్టాలని చెప్పడంతో రుణమాఫీ ఆనందం రైతుల్లో లేకుండా పోతున్నది. రుణమాఫీ వివరాలు తెలుసుకోవడానికి రైతులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఏ ప్రామాణికంగా రైతులకు రుణమాఫీ చేశాడో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రైతు రుణమాఫీ ప్రకటనతో రేవంత్ సర్కార్ రైతులను మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. ఎటువంటి షరతులు లేకుండా అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

***రుణమాఫీ కాలేదంటూ రైతుల ఆందోళన..***

కొంతమంది రైతులకు అర్హత ఉన్నా రూ.లక్షలోపు రుణాలు మాఫీ కాలేదు. ఇదేమని వ్యవసాయశాఖ, బ్యాంకర్లను అడిగితే మాకు తెలియదని సమాధానం చెప్పడంతో రైతులకు ఏమి చేయాలో పాలు పోవడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు సుమారు 1.40లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నారు. అయితే మొదటి విడుత జిల్లాలో 24,398 మంది రైతులకు రుణమాఫీ రూ.144 కోట్లు అయ్యిందని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో పేర్లు ఉన్న వారందరికీ రుణమాఫీ అయిందని అధికారులు రైతులకు చెబుతుండగా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. తాము రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నా తమకు రుణమాఫీ కాలేదని రైతులు లబోదిబోమంటున్నారు.

అయోమయం..

## గందరగోళం

- రూ.లక్షలోపు మాఫీ కాని పంట రుణాలు
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

మల్దకల్, జూలై 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగా ఈనెల 18 నుంచి రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేసింది. కానీ చాలా మంది రైతులకు బ్యాంకుల్లో రుణాలు మాఫీ కాకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. దీంతో తమకెందుకు రుణమాఫీ వర్తించలేదని బ్యాంకులు, సింగిల్‌విండోలు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మల్దకల్ మండలంలో పీఏసీసీఎస్ కార్యాలయం ఒక్కటే ఉంది. ఈ బ్యాంకు పరిధిలో మండలంలోని 25 గ్రామ పంచాయతీల రైతులు రుణాలు పొందుతున్నారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో అదే పనిగా తమ రుణం మాఫీ అయిందా లేదా అనే విషయంలో తిరుగుతున్నారు. సింగిల్ విండో కార్యాలయంలో మొత్తం 400మంది రైతులు రుణాలు పొందినట్లు అధికారులు చెబుతున్నారు. రూ.లక్ష లోపు రుణాలు పొందిన రైతులు 309 మంది ఉండగా, రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు రుణాలు పొందిన రైతులు 54మంది, రూ.2లక్షలలోపు వరకు తీసుకున్న వారు 19 మంది, 2 లక్షల పైబడి ఉన్న వారు 18మంది ఉన్నారు. కాగా రూ.లక్ష లోపు ప్రకటించిన రుణమాఫీలో 309మంది రైతులకు గానూ కేవలం 85మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించింది. ఇంకా 224 మందికి రుణమాఫీ కాలేదని అధికారులు చెప్పారు. మొత్తం 400 మంది రైతులకు రుణమాఫీ కింద రూ.2,62,78,800 జమ కావాల్సి ఉండగా 85 మంది రైతులకు రుణమాఫీ కింద ప్రభుత్వం రూ.41,81,133 జమ చేసిందని చెప్పారు. అయితే తమ రుణం ఎందుకు మాఫీ కాలేదు. ఈ విషయంలో ఎవరిని సంప్రదించాలని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

### రూ.40 వేలు ఉన్నా మాఫీ కాలె..



మల్దకల్ మండలంలోని గార్లపాడు శివారులోని 16, 17 సర్వే నెంబర్‌పై మల్దకల్ సింగిల్ విండో కార్యాలయం నుంచి ఎన్నో ఏండ్ల నుంచి రుణం తీసుకుంటున్నాను. అయితే 2023 డిసెంబర్‌లోపు రుణం రెన్యువల్ చేసుకోవడంతో కేవలం రూ.40వేలు మాత్రమే మిగిలినా తనకు రుణమాఫీ వర్తించలేదు. నాతో పాటు చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఈ విషయంలో బ్యాంకు, వ్యవసాయాధికారులను ఎవరిని అడిగినా ఏమీ చెప్పడం లేదు. ప్రభుత్వం అర్హులందరికీ రుణాలు మాఫీ చేయాలి.

*- తిక్కన్న, రైతు, ఎల్కూర్, మల్దకల్ మండలం*

### అసలు కన్నా.. వడ్డీ ఎక్కువ చూపుతున్నారు..



మల్దకల్ సింగిల్ విండో కార్యాలయంలో జూన్ 2023 లో రూ.39 వేలు అప్పు తీసుకోగా దానిని కూడా డిసెంబర్ నెలలోపే రెన్యువల్ చేసుకున్నా. అయితే ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తనకు వర్తించలేదు. ఈ విషయంపై బ్యాంకు అధికారులను అడగ్గా వ్యవసాయ కార్యాలయంలో అడగమన్నారు. వ్యవసాయ కార్యాలయానికి వెళితే అక్కడ చూసి తీసుకున్న అసలు అప్పుకన్నా వడ్డీ ఎక్కువగా చూపుతుంది. అయితే జనవరి నుంచి జూలై వరకు కేవలం రూ.705 వడ్డీ మాత్రమే చెల్లించాల్సి ఉంది. కానీ రికార్డుల్లో ఎందుకు ఎక్కువ చూపెడుతున్నదో అర్థం కావడం లేదు.

*- నర్సింహులు, రైతు, ఎల్కూర్, మల్దకల్ మండలం*



మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాతృమూర్తి స్వర్గీయ సింగిరెడ్డి తారకమ్మ 5వ వర్ధంతి సందర్భంగా సోమవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి తన మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అంతకుముందు కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ క్షేత్రంలోని ఆమె సమాధి వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, అశోక్, మాణిక్యం, నాగన్నయాదవ్, తిరుమల్, రహీం, గౌడనాయక్, యుగంధర్‌రెడ్డి, జోహెబ్, మహేశ్వర్‌రెడ్డి, రాము, వెంకటేశ్, శ్రీను, రాజు పాల్గొన్నారు. **– వనపర్తి, జూలై 22**



జూరాల గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద

## శ్రీశైలానికి కృష్ణమ్మ పరుగులు

- జూరాలకు పోటెత్తిన వరద
- 37 గేట్ల ద్వారా 1,45,003 క్యూసెక్కుల నీటి విడుదల
- జలవిద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి
- టీబీ డ్యాం మూడు గేట్ల ఎత్తివేత

గద్వాల, జూలై 22 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జూరాలకు వరద నీరు వచ్చి చేరుతున్నది. సోమవారం రాత్రి వరకు ప్రాజెక్టుకు 1,70,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టులోని 37గేట్లు ఎత్తి 1,45,003 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ జూరాలలో ఐదు, దిగువ జూరాలలోని ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పూర్తి స్థాయి నీటిమట్టం 318.516మీటర్లు కాగా ప్రస్తుతం 317.490 మీటర్లుగా ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.627 టీఎంసీలుగా ఉన్నది. కాగా, విద్యుదుత్పత్తికి 28,292 క్యూసెక్కులు, నెట్టెంపాడ్ లిఫ్ట్‌నకు 1,500, భీమా లిఫ్ట్–1కు 1,300, ఎడమ కాల్వకు 640, కుడి కాల్వకు 584 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 1,77,361 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదవుతున్నది. కాగా, నారాయణపూర్ డ్యాం వద్ద 25 గేట్లు ఎత్తగా దిగువకు 1,44,250 క్యూసెక్కులు జూరాలకు చేరుతున్నాయి.

***పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర..***

అయిజ, జూలై 22 : తెలంగాణ రాష్ట్రంలోకి తుంగభద్రమ్మ వడివడిగా అడుగులేస్తున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాంకు వరద ప్రవాహం పెరుగుతుండడంతో సోమవారం కర్ణాటకలోని హొస్పేట్‌లోని తుంగభద్ర డ్యాం 3 క్రస్ట్ గేట్లు ఒక అడుగు మేరకు ఎత్తి దిగువకు నీటిని తుంగభద్ర నదిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతూ ఆర్డీఎస్, సుంకేసుల, శ్రీశైలం వైపు అడుగులు వేస్తున్నది. టీబీ డ్యాంలోకి ఇన్‌ఫ్లో 1,03,891 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 13,365 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 88.358 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, 1633 అడుగుల నీటి మట్టానికి గానూ 1628.45 అడుగులు ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. సాయంత్రం 4 గంటలకు టీబీ బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి 3 గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. టీబీ డ్యాంకు రాత్రి ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని చెప్పారు. నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీబీ బోర్డు ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు బుధవారం వరద నీరు చేరుకుంటుందని, అక్కడి నుంచి సుంకేసుల మీదుగా, శ్రీశైలం ప్రాజెక్టుకు తుంగభద్ర జలాలు చేరుకుంటాయని ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు.

***శ్రీశైలానికి లక్షకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..***

శ్రీశైలం, జూలై 22 : శ్రీశైలం జలాశయానికి వరద క్రమక్రమంగా పెరుగుతున్నది. ఎగువన జూరాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదల జరగగా.. సోమవారం రాత్రికి శ్రీశైలం డ్యాంకు 1,10,304 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత నీటినిల్వ 833.60 అడుగులు ఉండగా.. సామర్థ్యం 215 టీఎంసీలకుగానూ ప్రజెంట్‌గా 53.3713 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఏపీ, టీఎస్ పవర్‌హౌస్‌ల్లో విద్యుదుత్పత్తి ప్రారంభం కాలేదు.

***కొనసాగుతున్న పంపింగ్..***

మక్తల్, జూలై 22 : కృష్ణానదికి భారీ వరద వస్తున్న నేపథ్యంలో భీమా ఫేజ్–1లో అంతర్భాగమైన చిట్టెం నర్సిరెడ్డి (సంగంబండ), భూత్పూర్ రిజర్వాయర్లకు పంపింగ్ కొనసాగుతున్నది. మక్తల్ మండలం చిన్నగోప్లాపూర్ వద్ద భీమా ఫేజ్–1 స్టేజీ–1 పంప్‌హౌస్ నుంచి 1300 క్యూసెక్కుల నీటిని రెండు మోటర్ల ద్వారా పంపింగ్ చేస్తున్నారు. వీటి నుంచి భూత్పూర్ రిజర్వాయర్‌కు 500 క్యూసెక్కులు, చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 800 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 3. 317 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 1.66 టీఎంసీలకు చేరింది. దీంతో సంగంబండ నుంచి మెయిన్ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



చిన్న గోప్లాపూర్ వద్ద విడుదలవుతున్న నీరు



చెక్‌డ్యాం వద్ద గంగమ్మకు పూజలు చేస్తున్న ఆల

### కేసీఆర్ పాలనకు నిలువెత్తు సాక్ష్యం


- రావులపల్లి చెక్‌డ్యాంకు జలకళ
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, జూలై 22 : కేసీఆర్ హయాంలోని ప్రజారంజక పాలనకు నిలువెత్తు సాక్ష్యం రావులపల్లి చెక్‌డ్యాం అని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో దేవరకద్ర నియోజకవర్గంలో 30 చెక్‌డ్యాంలు నిర్మించామని, ఇందులో భాగంగానే రావులపల్లి చెక్‌డ్యాంతోపాటు వంతెనను రూ.3.80 కోట్లతో నిర్మించినట్లు చెప్పారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీళ్లు పారి చెక్‌డ్యాం జలకళను సంతరించుకోగా ఆలను స్థానిక రైతులు ఆహ్వానించారు. దీంతో సోమవారం ఆయన చేరుకొని చెక్ డ్యాం వద్ద గంగా జలాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు జై తెలంగాణ అంటూ హారతులు పట్టారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, నారాయణగౌడ్, సాయిలు, సత్యనారాయణ, బాలస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, రాజారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఖాజా, షాకీర్, సత్యం, మధు పాల్గొన్నారు.

## పౌరుషానికి ప్రతీక పాపన్నగౌడ్

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి
- గౌడ కులస్తుల సంక్షేమాభివృద్ధికి కృషి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- నాగర్‌కర్నూల్‌లో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ
- హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నాగర్‌కర్నూల్, జూలై 22 : పౌరుషానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్‌లో పాత ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌడ కులస్తుల ఆరాధ్యుడు సర్దార్ సర్వాయి పాపన్న కాంస్య విగ్రహాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ, స్వామిగౌడ్‌తో కలిసి మంత్రి జూపల్లి హాజరై ఆవిష్కరించారు. అనంతరం స్థానిక సాయిగార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ పాపన్నను గౌడ్‌ను సమాజం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కల్లుగీత కార్మిక వృత్తిలో ఉన్న ఇబ్బందులు తనకు తెలుసునని, కార్మికుల సంక్షేమం, రక్షణకోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఈత చెట్టు ఎక్కి కల్లు సేకరించే కార్మికుల కోసం సేఫ్టీ కిట్లను అందిస్తున్నారని వివరించారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య నేతలు

***గౌడల సంక్షేమానికి పాటుపడుతాం : శ్రీనివాస్‌గౌడ్***

తాను ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో గౌడ కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేశానని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మద్యం దుకాణాల్లో వీరికి 15 శాతం దుకాణాల కేటాయింపు, కోటీ 20 లక్షల ఈత, తాటి చెట్ల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ వంటి పథకాలను అందించామన్నారు. తాను ఐదేండ్లు మంత్రిగా ఉండి గీత కార్మికుల వృత్తిపై చీమ వాలనివ్వలేదన్నారు. పాపన్నగౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై స్వర్గీయ వెంకటస్వామి విగ్రహం పక్కన ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లిని కోరారు. 32 కోటలను జయించి 24 చెరువులను తవ్వించిన గొప్పధీరుడు పాపన్న అన్నారు. చరిత్రలో ఆయన పేరు రాకుండా కొందరు కుట్ర పన్నారని, శివాజీ మహారాజ్‌కు తీసిపోని విధంగా కోటలను స్వాధీనం చేసుకొని రాజుల పాలనను అంతమొందించి తాను రాజుగా ఈ ప్రాంతాలను పాలించారని గుర్తు చేశారు. అనంతరం స్వామిగౌడ్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ మాట్లాడుతూ పాపన్న చరిత్రను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని, సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోరాడిన గొప్ప మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, జిల్లా అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, సూర్యప్రతాప్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్, చైర్మన్ ఆనంద్‌గౌడ్, సీనియర్ జర్నలిస్టు కొండల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే వంగా మోహన్‌గౌడ్, వంగా ఫకీరయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ బాలగౌడ్, వంగ లక్ష్మణ్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజన్, గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

### 'ఆశ'ల ఆందోళన : కలెక్టరేట్ ముట్టడి

గద్వాల, జూలై 22 : ఆశ వర్కర్లు ఆందోళనకు దిగారు. సోమవారం జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తమకు ఫిక్స్‌డ్ వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో 15 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యల పరిష్కరిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రస్తావించినట్లు తెలిపారు. కానీ అధికారంలోకి రాగానే మా సమస్యలను ఆలకించే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నర్సింహ, ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, సునీత, నాగప్రమీల, కాంతమ్మ, నరసమ్మ, పద్మ, శ్రీదేవి, లక్ష్మి, నాగేశ్వరమ్మ, సరస్వతి, అనసూయమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.